# న్యాయం ఉరికొరిగింది



మన్నెరెడ్డి వెంకటరెడ్డి

ఆడో పల్లుంది. దానికో కొత్వాలున్నాడు. పేరు కొమరయ్యా. ఆ కొత్వాలు కొమరయ్యే ఆపల్లెకి ప్రెసిడెంటు, కరణం, గిరణం అన్నీ ఆయనే! ఏదన్న పంచాయతయితే పంచనామా చేస్తరు. పైసలు పంచుకుంటరు. కొత్వాలు కొమరయ్య, ఆనాలు కల్సి గుడుంబ దుకానానికి పోతరు.

పంచాయితీ జరుగు తున్నట్టుంది. గుండ్రాయి చుట్టూజనం మూగిన్రు. గంజి తాగేటోళ్ళు నేలమీద కూసున్నరు. గటక బువ్వ తినేటోళ్ళు యిటుక పెల్లల మీద కూసున్నరు. వరి బువ్వ తినేటోళ్ళు అరుగుల మీద కూసున్నరు.

ఆళ్ళు తినే మేతలను బట్టి, పైసలను బట్టి గట్లనే కూసుంట రెప్పుడు!

ఆడికి-అంటే ఆ గుండ్రాయి కాడికి మొగుడు పెళ్ళాలు ఒచ్చిన్రు.

ఆళ్ళు సగందాకా వంగి రెండు చేతులు తలమీదకెత్తి, ఆడున్న పెద్దోళ్ళకిదండాలు పెట్టిన్రు. అల్లట్ల దండాలు పెడతంటే మర్యాదకి మాత్రూపాలనిపిస్తంది.

కొత్వాలు కొమరయ్య, పల్లెపెద్దలు ఏందో ముచ్చట్లాడు కుంటనే మొగుడూ పెళ్ళాల దండాల్ని తీసుకొని, ఏందన్నట్లు చూసిన్రు!

"శాల్మొకుక్కత; నీ బాంచను" అని మల్లి ఒంగి. దండం పెట్టి— "దొరా! నాయం సూపాలె!" అని మల్లి ఒంగి దండం పెట్టిండు.

ఆడి దండాలకి, కొత్వాలు కొమరయ్య ఖుషీ గున్నడు.

"ఏందిరా యాదగిరీ, ఏందైంది" కొత్వాలు కొమరయ్య. "బాంచను న్యాయం సూపాలె" మల్లి అట్లనే.

"అదేందో, ఆ మతలబ్ ఏందో యిమ్మర్వగ జెప్పు" పెద్ద గద్దించిండు.

యాదగిరి జనాన్ని చూసిండు. ఇజ్జత్ పోతందని గుటకలు మింగిండు. ఇప్పుడేక్కె పెళ్ళంతో ఈడిదాకొస్తి; నిండ మునిగి నోస్కి సలేందనుకొని— "బాంచను

దొరా: నా పెళ్ళాం చెడింది దొరా, దాన్ని యిడుస్త''

''ఏంచే, నర్సి: నువ్వేమంటవ్ ?''-

నర్సి ఏడుస్తంది.

ఏసిన ప్రశ్నకి జవాబు జెప్పక పోతే గద్దిస్తడని కొంగుతో కళ్ళొత్తుకొని- ''ఇందుల నా తప్పు లేద్దొర !''

కొత్వాలు దిక్కులు చూస్త, ఆకుల లెక్కపెడతండు, అ జవాబుకి ఒక్క రంకేసి- ''అట్లనే నానే జవాబు''

''ఔ దొర! నా తప్పేం లేద్దొర''

''అగ్గో మల్ల గట్లనే''

''ఔ దొరా! నిన్న నేను ఈడు కల్లం కాడ ఉన్నం. అప్పుడే చీకటయితంది దొరా! చిన్నదొర వొచ్చిండాడికి. ఈడ్ని ఏందో తెమ్మని ఊళ్ళోకి పంపిండు. అప్పుడు నే నొక్కతినే ఒంటి గున్న దొరా! చిన్నదొర నన్ను చూసిండు. నా దగ్గర కొచ్చిండు. నర్సి! యిట్లరావే'' అన్నడు. ఎల్లి 'ఏం' దన్న. ఏం మాట్లాడ లేద్దొర! దిక్కులు చూసుకుంట ఉన్నడు. ఉన్నట్టుండి నన్ను గట్టిగ వాటేసుకున్నడు. నేను అదిలించి కొట్టినా నన్ను...'' చెంగడ్డం పెట్టుకుని గట్టిగ ఏడుస్తంది.

కొమరయ్య తన కొడుకు కేసని రేపటికి వాయిదా వేసిండు.

తెల్లారింది.

గుంట్రాయి కాడ నిన్నటి కన్న ఎక్కువ మంది పోగయిన్రు. ఏం జెప్పుతడా అని ఎదురు చూస్తన్రు.

ఆడికి అందరూ ఒచ్చిన్రు. కానీ, నర్సి, యాదగిరీ రాలేదు,

కొత్వాలు కొమరయ్య మీసాలు మెలితిరిగి ఉన్నై! ✱

---

## వ-చ్చే-వా-ర-ం:

- నూరేళ్ళ జీవితాన్ని చూసిన టెలిఫోన్ (విశేష రచన) — జె. ఎస్. లక్ష్మి
- గోడ (కథ) — వంతుల జోగారావు
- మంటలు (కథ) — ప్రతాప రవిశంకర్
- కలుపుమొక్క (కథ) — పావినేని శివశంకరరావు
- స్త్రీలు ఆలోచిస్తున్నారా? — ఎన్. అరుణ
- మహాకవి శ్రీ శ్రీ చైనా పర్యటన విశేషాలు
- వాసిరెడ్డి సీతాదేవి సీరియల్ నవల సావేరి
- కమలాదాస్ మనసులోని మాట
- రాజు—పేద • సినీతంత్ర • బాలతంత్ర